


# సంకెళ్లు

— ఈశ్వర్

సాయంత్రం ఐదుంపావయింది. ఒక్కొక్కరూ ఆఫీసునుంచి బయటపడుతున్నారు. నేను కూడా నెమ్మదిగా ఫైళ్ళన్నీ సర్దేసి ఒకసారి రుమాలుతో మొహం తుడుచుకున్నాను. గేటు బయటకు వచ్చే సరికి దూరంగా రఘురాం సిగరెట్టు వెలిగిస్తూ కనపడ్డాడు. అప్రయత్నంగానే నా మొహం సీరియస్‌గా అయిపోయింది. నెల రోజుల కిందటి నుంచి రఘురాం ప్రవర్తన నాకు అర్థంకావటం లేదు. గత రెండేళ్ళ బట్టి అతనిని చూస్తున్నా నెలబట్టి అతనిలో ఏదో మార్పు వచ్చినట్టనిపిస్తోంది. గుచ్చి గుచ్చి చూస్తున్నట్టు, నా ప్రతి కదలికను అతను పరీక్షిస్తున్నట్టు, ఎప్పుడైనా పొరపాటున అతనివేపు చూస్తే దీక్షగా చూస్తున్నట్టున్న ఆ కళ్లు. రోజు రోజుకూ చికాకు వచ్చేస్తోంది. ఇతనూ మామూలు మగవాడే. ఇన్నాళ్ళూ ఏదో మంచి వాడనుకున్నాను కాని....

ఆలోచిస్తూ నడుస్తూన్న నేను ఠక్కున ఆగిపోయాను. "వనజగారూ!" రఘురాం పిలుస్తున్నాడు. సిగరెట్టు విసిరేసి కాలితో నలిపి దగ్గరగా వచ్చేడు. నేను విసుగ్గా అతనివేపు చూసేను.

అతను అదేం గమనించలేదు. రెండు జేబుల్లోనూ చేతులు పెట్టుకొని "మీతో పదినిమిషాలు మాట్లాడాలి. అలా పార్కుకి వెళదాం వస్తారా?" అన్నాడు.

నేను ఆశ్చర్యపోయాను. అతను అలా అడుగుతాడని అనుకోలేదు.

"నాతోనా? ఏం మాటలు? ఇక్కడే చెప్పొచ్చు కదా!" అన్నాను కాస్త కఠినంగానే.

"రోడ్డుమీద నిలబడి మాట్లాడవలసినవి కాదండీ. ఒక్క పదినిమిషాలు. ప్లీజ్" నా సమాధానం కోసం చూడకుండానే అతను ముందుకు నడవటం మొదలు పెట్టేడు. తప్పనిసరిగా నేనూ అతనిని అనుసరించేను.

దూరంగా జనసంచారం తక్కువగా ఉన్నచోట అతను వెళ్ళి కూర్చున్నాడు. నాకు ఎవరేనా చూస్తారేమోనని బెరుగ్గా ఉంది. ఎందుకొచ్చేనురా భగవంతుడా అని అనిపించింది.

"ప్లీజ్, కూర్చోండి" రఘురాం అన్నాడు.

అతనికి కాస్త దూరంగా కూర్చున్నాను.

మా యిద్దరి మధ్య ఐదు నిమిషాలు మౌనం. నాకు విసుగ్గా ఉంది. ఏదో మాట్లాడాలి అని ఏం మాట్లాడడేం? హఠాత్తుగా రఘురాం అడిగేడు "నా మీద మీ అభిప్రాయమేమిటి?"

నాకు కోపం వచ్చింది. ఈ ప్రశ్న అడగటానికి ఇంతదూరం ఇంత సస్పెన్సు క్రియేట్ చెయ్యాలా? అయినా నా అభిప్రాయంతో ఇతనికి ఏం పని?

"నా అభిప్రాయంతో మీకేం పని?" సీరియస్‌గానే అడిగేను.

"ఉన్న పనల్లా మీ అభిప్రాయంతోనే" అన్నాడు నెమ్మదిగా "చూడండి. విషయంలోకి సూటిగా వచ్చేస్తున్నాను. దీనిని మీరు మరోలా అర్థం చేసుకోకండి. నేను అవివాహితుడనని, నా జీతం ఎంతో, నా ప్రవర్తనవల్ల నేను ఎలాంటి వాడినో కాస్తోకూస్తో మీకు తెలిసే ఉంటుంది, మరెంత పట్టించుకోకపోయినా. పోతే మా యింట్లో మెంబర్లు నా తరవాత ఇద్దరు చెల్లెళ్ళు, ఇద్దరు తమ్ముళ్ళు. నాన్న లేరు. అమ్మ ఉంది. గత నాలుగైదు నెలలబట్టి మా యింట్లోవాళ్ళకి ఉన్న

వాళ్ళు చాలరన్నట్టు మరో కొత్త మెంబర్ను వదిన రూపంలో తీసుకురావాలని సరదాపడుతున్నారు. ఆ సరదా కాస్తా పట్టుదలగా మారింది. నేనెలాగూ ఉద్యోగం చేసే అమ్మాయినే పెళ్ళి చేసుకోదలచాను. నా ప్రతి కష్టసుఖంలోనూ నా భార్య పాలుపంచుకోవాలి. ఆమె అర్థం చేసుకోకపోతే శాంతిగా ఉన్న ఈ కుటుంబం అశాంతిపాలై పోతుంది. అయితే తెలీని ఎవరినో చేసుకునేకంటే, తెలిసినవాళ్ళని చేసుకుంటే బావుంటుందనిపించింది. అందుకే నెల రోజులబట్టి మిమ్మల్ని తెగపరీక్షగా చూసేను. మీరు ఎన్నిసార్లు నన్ను తిట్టుకొని ఉంటారో. మీరు కూడా మధ్యతరగతి కుటుంబంలోనివారని, మీకు కూడా చెల్లెళ్ళు, తమ్ముళ్ళు ఉన్నారని తెలుసు. మీలో ఆడంబరం, అహంభావం లేవు. నాకు నచ్చిన ముఖ్యమైన గుణాలు అవి. మీకు ఇష్టమైతే మనం మేరేజ్ చేసుకుందాం. అన్నట్టు నేను నాన్‌బ్రాహ్మిన్‌ను. కాని శాకాహారిని" అన్నాడు రఘురాం నవ్వుతూ.

నేను నిశ్చేష్ఠురాలినయిపోయేను. ఇంత ధైర్యంగా రఘురాం నన్ను అడుగుతాడని అనుకోలేదు. అతని వేపు కళ్ళెత్తి చూడలేకపోయేను.

"మీరు వెంటనే నాకేం చెప్పక్కర్లేదు. నెలో, రెండు నెలలో ఆలోచించుకొనే చెప్పండి. ఒకవేళ మీకిష్టం లేకపోయినా నేనేం బాధపడను. ఎందుకంటే నాలో నచ్చనివి మీకు చాలా కనిపించవచ్చు. ముఖ్యంగా మన కులాలే ఒకటికావు. అయినా నాకు ఆ పట్టింపులేదు. మీవాళ్ళు ఒప్పుకోకపోవచ్చు. అయినా మీరిష్టపడితే అదో పెద్ద సమస్యకాదు. పదండి. చీకటి పడుతోంది. ఇంక వెళదాం" అన్నాడు రఘురాం లేస్తూ.

నెమ్మదిగా అతనితో వచ్చి బస్సుస్టాప్‌లో నిలుచున్నాను.

"కాఫీ తాగుదామా? అన్నాడు నెమ్మదిగా.

వద్దన్నట్టు తలూపేను.

"కూల్‌డ్రింక్?"

"వద్దు" నెమ్మదిగా అన్నాను.

"పోనీ ఐస్‌క్రీమ్?"

చురుగ్గా అతని వేపు చూసేను. అతను చిన్నగా నవ్వుతున్నాడు. నాకు తెలీకుండానే అప్రయత్నంగానే నేనూ నవ్వేను.

"అమ్మయ్య!" అన్నాడు ఎంతో రిలీఫ్ పొందినట్టు.

"ఏం?"

"గంటన్నరబట్టి ధుమధుమలాడే మీ మొహానికి కాస్త ప్రసన్నత చేకూరింది." ఇంకా ఏం అనేవాడో కాని నేను వెళ్ళే బస్సు వచ్చేసరికి అతని మాటలు వినిపించుకోకుండా గబగబ వెళ్ళి ఎక్కేసేను. అదృష్టవశాత్తూ కిటికీ దగ్గర సీటు దొరికింది. అతని కళ్ళు ఎందుకో నాకు మెరుస్తున్నట్టు అనిపించింది. అది నా భ్రమ అనుకున్నాను కాని అప్పుడే నాలో చిగురిస్తున్న ప్రేమ భావన అని నాకు తెలీలేదు.

*

"ఏం వనజా! ఇంత ఆలస్యమైంది?" అంది అమ్మ కాఫీ ఇస్తూ.

"ఒక ఫ్రెండ్ కనపడి మాట్లాడుతూంటే ఆలస్యమైందమ్మా!"

"బాగా అలిసిపోయినట్టున్నావు. స్నానం చేసి బట్టలు మార్చుకో. నీకిష్టమని బజ్జీలు చేసేను."

"నాన్నగారు ఇంకా రాలేదా అమ్మా! విజయ, రవి, గిరి ఏరీ?" అన్నాను చుట్టూ చూస్తూ.

"విజయ వాళ్ళ ఫ్రెండ్‌తో సినిమాకి వెళతానంది. రవి, గిరి ఆడుకోవడానికి పోయేరు. నాన్న అప్పుడే ఎందుకు వస్తారు? ఆ జీతం కాస్తా అయిపోయేక తిన్నగా వస్తారు. ఇంకా ఏదో తారీఖే కదా!" అంది విసుగ్గా.

నేను నెమ్మదిగా లేచేను స్నానానికి.

తమ్ముళ్ళు వచ్చేక మా ముగ్గురికి భోజనాలు వడ్డించింది. మధ్యలో విజయగురించి విసుక్కుంది తిరుగుళ్ళు ఎక్కువయేయని. నాకు కూడా నిజమేననిపించింది. ఈ మధ్య విజయ ఎక్కువగా 'ఈ ఫ్రెండ్‌దగ్గరకెళ్ళాలి, ఆ నోట్సురాయాలి' అని బయటే ఎక్కువ గడుపుతోంది. వచ్చేక అడగాలి.

భోజనాలు అయేసరికి పక్కింటి కామాక్షమ్మగారు తయారు. 'గుళ్ళో హరికథకి వస్తావా? జానకీ!' అని.

"ఎలా రానండీ! ఇంకా ఆయన రాలేదు. చిన్నది రాలేదు. ఏమిటో నా జీవితం ఇలా వంటింటికి పరిమితమైపోవలసిందే." అంది అమ్మ నిట్టూరుస్తూ.

"నువ్వెళ్ళమ్మా! వాళ్ళకి నేను పెడతాలే." అన్నాను.

"వద్దమ్మా! ఆఫీసులో చేసి చేసి వస్తావు. ఇంకా ఇక్కడ ఏంచేస్తావు!" అంది అమ్మ.

"పరవాలేదమ్మా! వెళ్ళు" అన్నాను.

"మీ వనజ లాంటి పిల్లలు నూటికీ, కోటికీ ఒకరు ఉంటారండి. నోరూ వాయీలేదు. ఏమిటో ఆ కల్యాణయోగం రావటంలేదు కాని" కామాక్షమ్మ నిట్టూర్పులు.

"మాకూ అదే బెంగ పిన్నిగారూ! చూస్తూ తక్కువవాడికి ఇవ్వలేం. ఎక్కువవాడిని తేలేం. ఎప్పటికి దానికి ఆ యోగం ఉందో" అంది అమ్మ పైట సవరించుకుంటూ.

తలుపు వేస్తూ ఎక్కువవాడూ వద్దు. తక్కువవాడూ వద్దు. సమానమైనవాడిని తేవచ్చుకదా అని అనుకున్నాను.

*

ఇంకా ఎనిమిదిన్నరే అయింది. తమ్ముళ్ళిద్దరూ గాఢ నిద్రలో మునిగిపోయేరు. నెమ్మదిగా పక్కమీదకు వాలేను. రఘురాం మాటలే గుర్తుకు వస్తున్నాయి. ఎంత సభ్యతగా అడిగేడు. ఇష్టమైతే పెళ్ళి చేసుకుంటానన్నాడు. కాని అమ్మా, నాన్నా ఒప్పుకుంటారా? చచ్చినా ఒప్పుకోరు. తమ వీధిలో ఉన్న వసుంధర, వాళ్ళాఫీసులో ఉన్న అతనిని పెళ్ళాడినందుకు అమ్మా, నాన్నా ఎంత అసహ్యంగా తిట్టేరో తను మరచిపోలేదు. పోనీ అమ్మా, నాన్నా చూసిన సంబంధం చేసుకుందాం అంటే....

అసలు ఒకటేనా కుదరడంవరకు ఎక్కడ వచ్చింది? పది, పదిహేనుమంది వరకు పెళ్ళికొడుకులు చూసేరు తన్ను. ఇందులో ఎంత నిజం ఉందో తెలీదు కాని ఎక్కువ మందికి తను నచ్చలేదని అనేవారు. నిజంగా తను అంత అనాకారినా? కాదే. తనకన్నా అసహ్యంగా ఉన్న పెళ్ళికొడుకులకి తను నచ్చలేదంటే? లోపం ఎక్కడో ఉంది. చివరిసారిగా పదిహేనురోజుల కిందట ఒక పెళ్ళికొడుకు వచ్చేరు. చాలా నల్లగా ఉన్నాడు కాని మంచి ఎత్తుగా, పర్సనాలిటీతో ఉన్నాడు. అతని చూపులను బట్టి నచ్చాననే అనుకున్నాను. ఉన్నంత సేపూ చాలా సభ్యతగానే మాట్లాడేడు. ఉద్యోగ వివరాలు అడిగేరు. ట్రాన్స్‌ఫర్‌కి వీలవుతుందా అన్నాడు. ఆహా! ఇతనికి నచ్చేనుకాబోలు అని అనుకున్నాను. హైదరాబాదులో బాంక్‌లో పనిచేస్తున్నాడు. వెళ్ళిన వెంటనే ఉత్తరం రాస్తానన్నాడు. అప్పుడే పదిహేను రోజులయింది. ఇంకా ఉత్తరం రాలేదు.

అమ్మకి, నాన్నగారికి అతని వరస ఏం నచ్చ లేదు. కాకిలా వున్నాడన్నారు. వాడికి నచ్చినా మన పిల్లని ఇవ్వొద్దు కాకిముక్కుకి దొండపండులా, అన్నారు. చెల్లి మాత్రం ధైర్యంగా అంది.

"నలుపయితేనేం? బాగానే, వున్నాడు. అతనికి నచ్చితే అక్కకి నచ్చాదేమో కనుక్కుని చేసేయ కూడదూ? ఇంకా ఎన్నాళ్ళు. ఇప్పటికే ఇరవై ఆరేళ్ళు వచ్చేయి" అంది కోపంగా.

భోజనం చేస్తున్న నేను నిశ్శబ్దంగా వుండిపోయేను అన్నం కెలుకుతూ.

"అవునే. నువ్వొఅనవే. నచ్చిన సంబంధం వస్తే ఎందుకు చేయమే?" అంది అమ్మ.

"నచ్చిన సంబంధం అంటే?" అంది చెల్లి వెక్కిరింపుగా.


"నోర్ముయ్. పెద్దంతరం, చిన్నంతరం లేకుండా." అమ్మ చేయి విసురుగా లేవబోయింది. నేను గబుక్కున పట్టుకున్నాను. విజయ విసురుగా అక్కడినుంచి వెళ్ళిపోయింది.

అప్పుడే పదిహేను రోజులయింది. అంటే అతనికి కూడా నేను నచ్చలేదన్న మాట. అప్రయత్నంగానే నవ్వు వచ్చింది. నేను నచ్చిన వాళ్ళకి అమ్మావాళ్ళూ ఇవ్వరు. అమ్మా వాళ్ళకి నచ్చిన వాళ్ళు నన్ను మెచ్చరు. ఈ వలయం విడేదెప్పుడు?

రఘురాం ఈ రోజు ఆలోచన అనే పురుగుని నాలో ప్రవేశపెట్టేడు. అది నన్ను నిలవనీయడం లేదు. ఏంచెయ్యాలి? వీళ్ళందరినీ నేను వదిలి వుండగలనా? ఈ సంకెళ్ళని నేను త్రెంచగలనా? ఆలోచనలతో తల బద్దలైపోతోంది. లాభం లేదు. వీటినుంచి తప్పించుకోవాలంటే ఏదేనా పుస్తకమే శరణ్యం.

విజయ అలమరా దగ్గరకు వెళ్ళేను. అది కాలేజీ నుంచి ఏవో నవల్సు అవీ తెస్తూంటుంది. వీలయినపుడు చదువుతూ వుంటాను. అందుకే దాని పుస్తకాలు వెతుకుతూ వుంటే ఒక పుస్తకంలోంచి ఒక కవరు జారిపడింది. అందులో ఒక ఉత్తరం. ఎవరో ఆనంద్‌ట. దీనిని ప్రేమించి ఆ ప్రేమలో పిచ్చివాడయి పోతున్నట్టు అదివరకు కలుసుకున్న మధురమైన కలయికల గురించి తెగ వర్ణించి రాసేరు.

నేను పిచ్చిదానిలా చూస్తూండిపోయాను. విజయ నాకంటే ఏడేళ్ళు చిన్నది. నా కళ్ళముందు పెరిగి పెద్దదయింది. కాని ఇంత పెద్దదయిందా నాకు తెలీకుండా?




టక టక తలుపుమీద శబ్దం. గబుక్కున ఎక్కడ పుస్తకాలు అక్కడ సర్దేను. తలుపు తీసేను. ఎదురుగా విజయ. నేను వింతగా దాని వేపు చూస్తూండిపోయేను.

అది లోపలికి వచ్చి బట్టలు మార్చుకుంటూ అడిగింది "అమ్మేది?"

"గుడికెళ్ళింది."

"నాన్నగారు ఇంకా రాలేదుకదూ! అప్పుడే ఎందుకు వస్తారు. ఇంకా ఏదో తారీఖే కదా!"

నేనేం మాట్లాడలేదు.

"అన్నం పెడతావా అక్కా! ఆకలేస్తోంది."

"ఊ....పద"

విజయ ఏం జరగనట్టు అమాయకంగా గబ గబ భోంచేస్తోంది, హఠాత్తుగా అడిగింది.

"అదేంటక్కా! అలా రెప్ప వాల్చకుండా చూస్తున్నావు?"

"ఇది రెండోసారి వినడం"

"మొదటిసారి ఎక్కడ విన్నావు"

గబుక్కున తలెత్తి "అబ్బో! అక్కగారి బుర్ర పాలిష్ అవుతోందే" అంది నవ్వుతూ.

"చెబుదూ! అన్నాను నేనూ నవ్వులాటగానే."

"నా ఫ్రెండ్ అక్కా!"

"బోయ్ ఫ్రండా? గర్ల్ ఫ్రండా?"

ఈసారి చురుగ్గా చూసింది నావేపు.

"నువ్వే చెప్పుకో" అంది కొంచెం కోపంగా.

"బోయ్ ఫ్రండే అయుంటాడు. ఎందుకంటే ఒక ఆడది మరో ఆడదాన్ని మెచ్చుకోవడం నైన్త్ వండర్ కదా!" అన్నాను నవ్వుతూ.

"చంపేవ్" అని పక పక నవ్వింది. భోజనం అయిపోయేక ముసుగు తన్ని పడుకుంది. లాభం లేదు. దీన్ని సూటిగానే అడగాలి. నెమ్మదిగా వెళ్ళి మంచం మీద కూర్చున్నాను.

"విజయా!"

"ఏంటక్కా? నిద్రవస్తోంది."

"సరె, పడుకుందువుగాని ముందు దీనికి జవాబు చెప్పు."

"దేనికి?" ఎంత విసుగో దాని కంఠంలో.

"ఆనంద్ ఎవరు?"

గబుక్కున మంచం మీద లేచి కూర్చుంది.

"ఏమిటీ?" అంది.

"అదే ఆనంద్ ఎవరూ అని అడుగుతున్నాను" నాకు తెలీకుండానే కంఠంలో కఠినత్వం చోటు చేసుకుంది,

"నాకేం తెలును? ఏ ఆనంద్?"

ఏం తెలీనట్టు అమాయకంగా మొహం పెట్టి అంది. చాచి లెంపకాయి కొట్టాలనిపించింది.

"ఏం తెలీకుండానే అతని దగ్గర్నుంచి ప్రేమ లేఖలు అందుకున్నావా ?"

"అక్కా !"

"నోర్ముయ్! నాన్న, అమ్మ ఎంత బాధపడతారు ఈ విషయం తెలుస్తే. చదువుకోమని కాలేజీకి పంపిస్తే పిచ్చివేషాలు వేస్తావా ? అప్పుడే నీకు ప్రేమా, పెళ్ళి కావలసి వచ్చిందా ? అమ్మా, నాన్నా లేరా పెళ్ళి చేయడానికి ?"

"ఆ....ఉన్నారు. ఎందుకులేరూ ? నీకు చేసేరు కదా ఆ తరవాత నాకు చేస్తారు. ఇరవై ఆరేళ్ళు దాటుతున్నాయి నీకు. అప్పుడే ఏం తొందరంటుంది అమ్మ అందరితోను. ఎందుకో తెలుసా ?

"విజయా !" నా కంఠం నాకే అదోలా వినిపించింది.

"ఉండక్కా ! నువ్వేం మాట్లాడకు. నీకు ఎలాగూ తెలిసిపోయింది కాబట్టి చెప్పేస్తున్నాను. ఆనంద్ నా క్లాస్‌మేట్. ఈ ఏడాదితో మా యిద్దరి చదువులూ అయిపోతాయి. మేమిద్దరమూ ప్రేమించుకున్నాము. ఏ ఒకరికి ఉద్యోగం వచ్చినా పెళ్ళి చేసుకుంటాము. ఇద్దరికీ ఉద్యోగాలు వచ్చేవరకు పిల్లల్ని కనము."

"అతనిది ఏం కులం ?"

"ఏమో తెలీదు.'

"అమ్మా, నాన్న ఒప్పుకోకపోయినా చేసుకుంటావా ?" ఆశ్చర్యంగా అడిగేను.

విజయ ఎంతో జాలిగా నా వేపు చూసింది.

"వీళ్ళు సవ్యమైన దానికే ఒప్పుకోరు. ఇంక దీనికి ఎలా ఒప్పుకుంటారు ? నీ మంచితనం వీళ్ళకి మెతకతనం కింద కనిపిస్తోంది. నిజంగా వచ్చిన పెళ్ళికొడుకుల కందరికీ నువ్వు నచ్చలేదనే అనుకుంటున్నావా ? అసలు అమ్మా నాన్నకే నీకు పెళ్ళిచేయడం ఇష్టంలేదు."

"ఎందుకూ ?" అన్నాను వణుకుతున్న కంఠంతో.

"ఎందుకా ? నెలకి ఎనిమిది వందలు చూస్తూ చూస్తూ ఎలా పోగొట్టుకుంటారు. స్వార్థానికి కళ్ళుండవక్కా. నీకు పెళ్ళయితే ఈ యింటి భారమంతా ఎవరు మోస్తారు ? అమ్మకి నెలకొక చీర, నాన్న దర్జా, తమ్ముళ్ళ సరదాలు, నా తిరుగుళ్ళు ఎలా జరుగుతాయి? నీ ఒక్కర్తి వల్ల ఇవన్నీ ఏ లోటూ లేకుండా జరిగిపోతూంటే నిన్నెలా పంపిస్తారు ? అదే నాలాంటిది అయితేనా ?"

"ఏం చేస్తావు ?"

"నాకు నచ్చిన వాడిని వీళ్ళకి చెప్పాపెట్టాకుండా పెళ్ళి చేసుకుని ఛలోరంగా అని వెళ్ళిపోతాను. ఇప్పటికైనా మేల్కొని నీ జీవితం గురించి నువ్వు ఆలోచించుకో. మరి నిద్రవస్తోంది. పడుకుంటాను." ముసుగు తన్నేసింది విజయ.

నాకు పిచ్చెక్కినట్టయింది. విజయ నాకన్నా ఏడేళ్ళు చిన్నది. కాని పద్నాలుగేళ్ళు పెద్దదానిలా మాట్లాడుతోంది.

తలుపు మీద టకటక శబ్దం. టైము పదకొండు. నాన్నగారేమో. కాని అమ్మ.

"ఇంకా ఈయన ఇంటికి రాలేదా ?"

"లేదు."

"ఎందుకొస్తారూ ? ఇంటి దగ్గర పెళ్ళాం పిల్లలూ ఉన్నారని గుర్తుంటే కదూ నువ్వెళ్ళి పడుకో. పిచ్చిపిల్లవి. అక్కడ చేసి చేసి ఇక్కడ కూడా చాకిరీ తప్పదు.

ఈ ఆప్యాయత వెనకాల స్వార్థం ఉందనుకుంటే నాకు ఒళ్ళు కంపరం ఎత్తింది.

*

పదిహేను రోజులు గడిచిపోయేయి. మళ్ళా రఘురాం ఆ ఊసు ఏమేనా ఎత్తుతాడేమోనని చూసేను కాని మా యిద్దరి మధ్యా ఆఫీసుకి సంబంధించిన మాటలు తప్ప ఇంకేమీ జరిగేవి కావు. చిలిపి చూపులు కాని, కొంటె మాటలు కాని ఏం లేవు. చాలా డిగ్నిఫైడ్‌గా ఉండేవాడు. నాకు తెలీకుండానే అతనంటే యిష్టం కలగడం ప్రారంభించింది. అందుకేనేమో రెండు నెలలు టైము ఇచ్చేరు. ఇంట్లో చాలా ముభావంగా ఉండటం ప్రారంభించేను. అమ్మ మాత్రం "అదేం? అలా ఉన్నావు ?" అంటోంది. "ఏం లేదు" నా జవాబు మామూలే.

ఆ రోజు నాన్నగారు ఇంట్లోనే ఉన్నారు. రాత్రి పదకొండు గంటలయింది. అంతా నిద్రలో ఉన్నారు. నాకు నిద్రపట్టడం లేదు. కళ్ళకి చెయ్యి అడ్డం పెట్టుకుని ఆలోచిస్తున్నాను. అమ్మ నెమ్మదిగా వచ్చింది నా దగ్గరకు.

"వనజా !" పిలిచింది నెమ్మదిగా. నేను పలకలేదు. నెమ్మదిగా చేత్తో తట్టింది, పడుకున్నట్టు ఉండిపోయేను. నెమ్మదిగా పక్కగదిలోకి వెళ్ళిపోయింది.



కార్పొరేటరు
కౌతా వెంకటలక్ష్మి

శ్రీమతి కౌతా వెంకటలక్ష్మి, విజయవాడ కార్పొరేషన్ ఎన్నికలలో కాంగ్రెస్ (ఐ) పార్టీ అభ్యర్థినిగా 15వ డివిజన్ నుంచి పోటీ చేసి, ఎన్నికయ్యారు.

బి. ఏ పట్టభద్రురాలైన వెంకటలక్ష్మి, విజయవాడలో ఇన్నర్‌వీల్ క్లబ్, భారత మహిళామండలి వంటి సంస్థల్లో కీలక పదవులను నిర్వహించి, పలువురి ప్రశంసలు పొందారు. వెంకటలక్ష్మి పూర్వీకులు రాజకీయ అనుభవం పండించుకున్న వారు. అంచేత రాజకీయాలు, సాంఘిక సేవలో పాల్గొనే ఆసక్తి, అవకాశాలు ఒక్కుమ్మడిగా కలిసి వచ్చాయి. దానికితోడు భర్త — ప్రముఖ ఛార్టెడ్ ఎక్కవుంటెంట్ శ్రీ కౌతా పూర్ణానందంగారి సంఘసేవ, వెంకట లక్ష్మికి, అండగా నిలిచింది.

పౌర సదుపాయాలు, పేద ప్రజలకు ఇళ్ళ స్థలాల కేటాయింపు, వికలాంగులకు వారి యోగ్యతలనుబట్టి ఉపాధి సౌకర్యాలు, వృద్ధస్త్రీ పురుషులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెల్‌ఫేర్ హొమ్స్‌లో చేర్పించడం, వయోజన విద్య అమలుకు కృషి, నగరాభివృద్ధికి కృషి చెయ్యడం శ్రీమతి వెంకటలక్ష్మి ప్రధాన ఆశయాలు.

—విజయవాడ విలేకరి

"అందరూ పడుకున్నారా?" నాన్న అడుగుతున్నారు.

"ఊ"

"ఇలా కొంచెం దగ్గరగా రా."

"ఛీ! ఉండండి. ఇవాళ మీతో అటో ఇటో తేల్చేసుకోవాలి."

"ఏమిటి వెధవ గొడవ?"

"అవును మీకు గొడవగానే ఉంటుంది. వీధిలో అందరూ కాకిని పొడిచినట్టు పొడుస్తున్నారు మీ అమ్మాయికి పెళ్ళి చెయ్యరా అని? మీకేమో చీమకుట్టినట్టయినాలేదు"

"ప్రస్తుతం చీమల మాటకేం గాని దోమలు కుడుతున్నాయి"

"చాల్లెండి. ఏదేనా అంటే సంభాషణ పక్కకి మళ్ళిస్తారు."

"ఊళ్ళోవాళ్ళు ఏదో అనుకుంటే నీకెందుకు బాధ"

"ఊళ్ళోవాళ్ళ సంగతి నాకు వద్దు. పోనీ మీ సంగతే చెప్పండి. అసలు మీరేం అనుకుంటున్నారు?

"దేని గురించి?"

"అదే వనజ పెళ్ళి గురించి. ఇరవై ఏడేళ్ళు వచ్చాయి. ఆ హైదరాబాదు అబ్బాయి ఏమన్నాడు? పోనీ నచ్చితే చేస్తే మన పరువూ నిలుస్తుంది. ఈ మధ్య వనజ అదోలా ఉంటోంది. ఆ వసుంధరలా ఏ కులం తక్కువ వాడినో కట్టుకుంటే ఆ తర్వాత ఏడ్చి ఏం ప్రయోజనం?"

"నీకాభయం ఏమీ అక్కరలేదులే. అలాంటి పని చేసేదయితే ఎప్పుడో చేసుండేది. అది మెత్తటి పిల్లి లాంటిది. అంత ధైర్యం దానికెక్కడుంది? ఆ అబ్బాయి ఎప్పుడో ఉత్తరం రాసేడు తనకి నచ్చిందని. నేనే మా అమ్మాయికి ఇష్టం లేదని రాసేసేను."

"అదేమిటి?" అమ్మ గొంతుకలో కోపం నేను గబుక్కున లేచి కూర్చున్నాను.

"అవును జానకీ! దీనికి పెళ్ళిచేసి పంపిస్తే ఈ ఇంటి భారమంతా నేనొక్కడినీ మోయగలనా? మగపిల్లవాడయితే బాధ్యత స్వీకరిస్తాడా లేదా? ఇంకా మగపిల్లలిద్దరికి చదువులు చదివించాలి విజయ పెళ్ళి చెయ్యాలి. మనం ఉండటానికి ఒక చిన్న యిల్లేనా కట్టుకోవాలి. మొదటి నుంచి ఖర్చుకి అలవాటుపడ్డ ప్రాణాలు మనవి. దీనినే మగపిల్లవాడనుకుంటే సరి"

"దీనికి పెళ్ళి కాకుండా విజయకి పెళ్లా?"

"విజయ దీనిలాంటిది కాదు. ఇప్పటికే దాని గురించి ఒకటి రెండుసార్లు తెలిసింది. దాన్ని అడిగితే రెచ్చిపోతుందని తెలీనట్టున్నాను. చదువయిపోయిన వెంటనే ముందు దాని పెళ్ళి చెయ్యాలి. వనజలా ఉంచితే అది తప్పకుండా మన పరువు తీసేస్తుంది."

"కాని లోకం ఏమనుకుంటుందండీ?"

"మనం లోకం కోసం బతకడం లేదు కదా! నిజం చెప్పు! నీకు మాత్రం వనజకి పెళ్ళి చేసి నెలకి 800 రూ॥లు దూరం చేసుకోవాలని ఉందా?"

అమ్మ జవాబుకి నేను ఎంతో ఆత్రుతగా ఎదురు చూసేను. కాని అమ్మ ఏం చెప్పలేదు.

నాన్నగారు నవ్వారు.

"కాని అది ఎందుకో మారినట్టు అనిపిస్తోందండీ. మునపట్లాలేదు"

"అది వయసుచేసే గారడీ. అలాంటప్పుడే



Dattaram RK-10-A

మనం జాగ్రత్తగా వ్యవహరించాలి. రేపో ఎప్పుడో ఒక వారం రోజులు దాన్ని సెలవు పెట్టమని నాలుగు ఊళ్ళు అలా తిరిగి వస్తే మళ్ళా కొన్నాళ్ళ వరకు పరవాలేదు. నువ్వూరుకో. నేను చూసుకుంటానుగా. ఊ...మాటలతోటే తెల్లారేటట్టుంది.'

ఆ తరవాత మాటలు వినిపించలేదు. కాని నా మనసు అగ్నిగుండమయింది. విజయన్నట్టు స్వార్థానికి కళ్ళుండవా? నాన్నదేం చిన్న ఉద్యోగం కాదు. నెలకి రూ. 1000 పైనే వస్తుంది. పొదుపుగా ఉంటే అందులోనే ఎన్నో చెయ్యొచ్చు. కాని వాళ్ళ సరదాలకి, షికార్లకి నన్ను కీలు బొమ్మగా చేద్దామనుకుంటున్నారు. మెత్తని పిల్లిని కూడా గదిలో బంధిస్తే పులిగా మారుతుందని తెలీదేమో? ఎంతయినా విజయ నా కన్నా తెలివైనది. దానికి థాంక్స్ చెప్పుకోవాలి. అడుగుల చప్పుడయింది. గట్టిగా కళ్ళు మూసుకున్నాను. అమ్మ వచ్చి తమ్ముళ్ళ పక్కలో పడుకుంది.

*

"వనజా!"

టిఫిను తింటున్న నేను తలెత్తేను.

"ఒక వారం రోజులు సెలవు పెట్టకూడదుటే"

"అమ్మ బాబోయ్! చచ్చిపోవడానికి కూడా ఇప్పుడు సెలవు దొరకదమ్మా!"

"ఛ! అవేం పాడుమాటలే?"

"ఎందుకమ్మా! సెలవు?"

"అలా నాలుగూళ్ళు తిరిగొద్దాం సరదాగా అన్నారే నాన్నగారు"

"మద్రాసు నుంచి ఆడిటర్స్ వచ్చేరమ్మా! పోనీ నువ్వూ నాన్నగారు వెళ్ళకూడదూ?"

"చాల్లే! ముసలి కాలంలో ముచ్చట్లు తక్కువని. నిన్నొదిలి నేనెలా వెళ్ళను? నువ్వెలా చేసుకుంటావు ఇంట్లో పని అదీను. నీ తరవాతే అంతాను. నీకు సెలవు దొరికినప్పుడే వెళదాం." అంది అపేక్షగా.

విజయ పకపక నవ్వింది. అమ్మ విజయ వేపు కోపంగా చూసింది.

"చూడక్కా! నువ్వంటే ఎంత ప్రేమో అమ్మకి!" అంది కళ్ళెగరేస్తూ.

నేను తేలికగా నవ్వేశాను.

"నోర్మూయ్! ప్రతిదీ నీకు వేళాకోళమే. తల్లికి పిల్లలంటే ప్రేమ ఉండదా?" అన్నాను నవ్వుతూ.

అమ్మ మొహం చేటంతయింది. నేను ఆఫీసుకి బయలుదేరాను.

*

నెలా పదిహేను రోజులయింది. రఘురాం మళ్ళీ ఆ ఊసు ఎత్తలేదు. అతను తన అభిప్రాయం మార్చుకున్నాడా? జీవితంలో నాకు ఎదురయ్యే ఏ ఒక్కటీ కూడా సవ్యంగా అవుతున్నట్టు లేదు. నెమ్మదిగా సాయంత్రం అయింది. గేటు బయటకి వచ్చేసరికి రఘురాం సిగరెట్టు కాలుస్తూ నిలబడి ఉన్నాడు.

"వనజా!"

ఆగిపోయేను.

"అలా పార్కుకి వెళదామా?"

మౌనంగా తలూపేను.

ఇద్దరం జనసంచారం తక్కువగా ఉన్నచోటుకి వెళ్ళి కూర్చున్నాము.

"ఇప్పుడు చెప్పండి వనజా! ఏమాలోచించేరు?"

నేనేం మాట్లాడలేక పోయేను.

అతను నెమ్మదిగా నా చెయ్యి తీసుకుని నా చేతిలోని రేఖలు పరీక్షిస్తున్నట్టు కూర్చున్నాడు. నేను చెయ్యి వెనక్కి లాక్కోలేదు.

"ప్లీజ్, చెప్పండి. ఏమాలోచించేరు?"

"మీ యిష్టం"

అతను సంతోషంగా ఒక్కసారి గట్టిగా నా చెయ్యి నొక్కేడు.

"వనజా! నా యిష్టం ఏనాడో చెప్పేను. నాకు కావలసినది మీ యిష్టం"

"నాకు యిష్టమే" అన్నాను నవ్వుతూ. అతని సంతోషానికి అవధులు లేకపోయేయి. గభుక్కున నా చేతిమీద ముద్దుపెట్టుకున్నాడు.

"కాని మా అమ్మా, నాన్నా ఇష్టపడరు" అన్నాను దిగులుగా.

"మరి వాళ్ళని వదిలి రాగలవా?"

"రావాలి" అన్నాను పేలవంగా నవ్వుతూ.

"వనజా! చాలు ఆ మాత్రం నమ్మకం నామీద ఉంటే చాలు. ఈ మనిషిని ఎందుకు పెళ్ళి చేసుకున్నానా అని బాధపడే రోజు రానివ్వను నీకు ఎప్పుడూ." అతను సంతోషంగా ఏవేవో చెబుతున్నాడు. నేను మౌనంగా వింటూ కూర్చున్నాను. ఆ కబుర్లలో మా భావిజీవితం, మా పిల్లలూ, మా వృద్ధాప్యం అన్నీ కలగాపులగంగా రంగురంగుల కలలా దూరంగా మసక మసకగా కనబడుతున్నాయి. □



కార్పొరేటర్

జంధ్యాల కామేశ్వరి శంకర్

శ్రీమతి జంధ్యాల కామేశ్వరి భర్తతోపాటు, మూడు సంవత్సరాలపాటు అమెరికాలో వుండి, అమెరికాలో భారత విద్యార్థులలోను, స్త్రీలకు చెందిన ఇంటర్నేషనల్ నైబర్స్ ప్రోగ్రామ్స్ లోను పాల్గొన్నారు. 1966 లో భర్తతోపాటు భారత దేశానికి తిరిగి వచ్చారు. కామేశ్వరి పట్టభద్రురాలు.

1969 లో భర్త డా॥ శంకర్ మునిసిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికయినప్పటి నుంచి అనేక రాజకీయ, సాంస్కృతిక, సాంఘిక సేవా కార్యక్రమాల లోను, శ్రీమతి కామేశ్వరి పాల్గొనేవారు. 1975 లో ఇన్నర్ వీల్‌క్లబ్ అధ్యక్షురాలిగా వుంటూ, శ్రీమతి కామేశ్వరి స్త్రీ - శిశు సంక్షేమకారిగా ఒక భవనాన్ని రోటరీ పార్కులో కట్టడానికి కారకులయ్యారు. ఇటీవల శ్రీమతి కామేశ్వరిని, ప్రభుత్వం వారు, విజయవాడ డిస్ట్రిక్ట్ జైలు వుమెన్ విజిటర్‌గా, నియమించారు.

పుస్తక పఠనం, టూరిజం, అంటే ఆసక్తి కనపరిచే కామేశ్వరి, ఇందిరా కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి, విజయవాడ కార్పొరేషన్ ఎన్నికలలో, కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు.

—విజయవాడ విలేకరి